క్లుప్తంగా

స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



విశిష్ట అలంకరణలో వేంకటేశ్వరస్వామి

జామి: వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం అయిన శ్రవణ నక్షత్రం, శ్రావణ పౌర్ణమి, శనివారం సందర్భంగా భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక అలంకరణగావించి, విశిష్ట పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ప్రసాద వితరణ గావించారు. అన్నంరాజుపేట పుష్పగిరి వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు గావించారు.

ఆదివాసీల సంక్షేమంపై దృష్టి సారించాలి

శృంగవరపుకోట: ప్రకృతి ఒడిలో జీవించే ఆదివాసీల సంక్షేమంపై పాలకులు దృష్టి సారించాలని దళిత ఉద్యమ నేత ఆతవు ఉదయ్‌భాస్కర్ విమర్శించారు. ఎస్.కోటలో ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో అంబేడ్కర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం స్కూల్ అసిస్టెంట్ మౌలానా అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో గిరిపుత్రులు వెనుకబడి ఉన్నారన్నారు. ఆదుకోవాల్సిన పాలకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బహుజన నాయకుల రామకోటి, గుర్రపు శ్రీను, పెద్దా సూరిదేముడు, డోల కేశవ, బి.ఈశ్వరరావు, పి.సురేష్, తెరపల్లి సూరిబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు



పశువులకు వైద్యసేవలు అందిస్తున్న డా.గాయిత్రీ

వేపాడ: మండలంలోని కృష్ణారాయుడుపేట గ్రామంలో శనివారం వేపాడ పశువైద్యాధికారి డా. కోరాడ గాయిత్రీ నేతృత్వంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 30 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స అందించిన డాక్టరు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. వర్షాకాలంలో పశువులు పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిహెచ్ ముసలినాయుడు, పాడి రైతులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ పౌర్ణమి



సత్సంగ్‌లో మాట్లాడుతున్న మాఘం కృష్ణమూర్తి

చీపురుపల్లి: పట్టణంలోని కొత్తఅగ్రహారం ఆర్య సమాజంలో శనివారం శ్రావణ పౌర్ణమిని వైభవంగా నిర్వహించారు. తెనాలికి చెందిన మాఘం కృష్ణమూర్తి నేతృత్వంలో సత్సంగ్, హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ సంప్రదాయంలో శ్రావణ పౌర్ణమి ముఖ్యమైన పండగ అన్నారు. శ్రావణ పౌర్ణమి రోజున యజ్ఞం చేసి, యజ్ఞోపవీతం మార్చుకోవడం సంప్రదాయంగా వస్తోందన్నారు. కార్యక్రమంలో ఆర్యసమాజం అధ్యక్షుడు దన్నాన సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు కుమరాపు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి సేవలో...



బాలల హక్కుల కమిషన్ చైర్మన్‌కు అమ్మవారి ఫొటో, ప్రసాదం అందజేస్తున్న ఆలయ ధర్మకర్తలు

చీపురుపల్లి: మండలంలోని రామలింగాపురం సమీపంలోని మానసాదేవీ నాగశక్తి అమ్మవారిని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు అమ్మవారి ఆశీస్సులతోపాటు చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పిన్నింటి రమణ, శ్రీను పాల్గొన్నారు.

అన్నదాత అష్టకష్టాలు..!



చందులూరు శివారు చెరువులో నీటి ఇంజిన్‌లతో నీరు తోడుతున్న దృశ్యం

- ఎండిపోతున్న నారుమడులు
- కాపాడుకునేందుకు అవస్థలు
- నియోజకవర్గంలో సాధారణ సాగు విస్తీర్ణం 16,533 హెక్టార్లు
- కేవలం ఏడు వేల హెక్టార్లలోనే ఊభాలు

లక్కవరపుకోట:

ఖరీఫ్ వరి సాగుకు వరుణుడు సహకరించడం లేదు. ఇటీవల పలు దఫాలు తుఫాన్‌లు వచ్చినా కనీసం ప్రభావం చూపలేదు. దీనికి తోడు రోహిణి కార్తె ఎండలను మైమరిపించేలా ప్రస్తుతం ఎండలు కాస్తున్నాయి. దీంతో వరి నారు మడులు పూర్తిగా ఎండిపోతున్నాయి. దీంతో నారు మడులు కాపాడుకునేందుకు అపార భగీరథ ప్రయత్నాలు రైతులు చేస్తున్నారు. సాగు పొలాలకు సుదూర ప్రాంతాల్లో ఉన్న చెరువులు, బావుల నుంచి పదుల సంఖ్యలో నీటి ఇంజిన్లు పెట్టి ఆశలను చంపుకోలేక తడులను అందిస్తున్నారు. అరకొర ఊభాలు వేస్తున్నారు. కొన్నిచోట్ల వరి ఆకుమడులను తడుపుతూ కాపాడుకుంటున్నారు. ఈ ప్రభావం ఎస్.కోట నియోజకవర్గంలో అధికంగా వుంది. నియోజకవర్గం పరిధిలో 16,533 హెక్టార్లు వరి సాధారణ విస్తీర్ణం కాగా ఇప్పటి వరకు కేవలం 6,980 హెక్టార్లలో మాత్రమే ఊభాలు జరిగాయి. ఇవి కూడి పూర్తి స్థాయిలో ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. ఎక్కువ శాతం సాగునీటి డ్యామ్‌లు ఉన్న ప్రాంతాల్లోనే ఊభాలు జరిగాయి. ప్రస్తుతం కాస్తున్న ఎండలకు పంటలు ఎండిపోయే స్థితికి చేరడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఎస్.కోట నియోజకవర్గం పరిధిలో చూస్తే ఎస్.కోట మండలంలోని సాధారణ విస్తీర్ణం 3171 హెక్టార్లుకుగాను 1712 హెక్టార్లలో మాత్రమే ఊభాలు పూర్తయ్యాయి. అలాగే లక్కవరపుకోట మండలంలోని 3604 హెక్టార్లకు 1760 హెక్టార్లలో, వేపాడలో 3546 హెక్టార్లకుగాను 1743 హెక్టార్లలో, జామి మండలంలోని 5322 హెక్టార్లకుగాను 1796 హెక్టార్లలో, కొత్తవలసలో 890 హెక్టార్లకుగాను కేవలం 61 హెక్టార్లలో మాత్రమే ఊభాలు పూర్తయ్యాయి. అయితే సాగుకు సరిపడ తడులు అందకపోవడంతో రైతులు నానా



ఎల్.కోట మండలం శ్రీరాంపురం పోలంలో పైపులను సర్దుతున్న అన్నదాతలు

కష్టాలు పడుతున్నారు. మరో పక్క ప్రభుత్వం కనీస సహకారం లేకపోవడంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఇదే సమయానికి ఒక్కో కనీసం రూ.7500 రైతు భరోసా రూపంలో అందేది. ప్రస్తుతం రైతు వంక ప్రభుత్వం కన్నెత్తికూడా చూడడం లేదు. కౌలు రైతులకు రుణాలు లేవు.

అంతంత మాత్రంగానే అన్నదాత సుఖీభవ

ఎన్నికల సమయంలో హామీలిచ్చి కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసింది. ఏడాదికి ఒక్కో రైతుకు రూ.20వేలు అందిస్తామని చెప్పి ఒక సంవత్సరం సహాయం ఎగ్గొట్టారు. ప్రస్తుత ఏడాదికి సంబంధించి నియోజకవర్గం పరిధిలో 41,144 మందికి రూ.21 కోట్లను అందజేశారు. అదే గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే నియోజకవర్గం పరిధిలో 42,288 మందికి రూ.50 కోట్లు అందజేశారు.

ప్రత్యామ్నాయ పంటలకు సహకారం లేదు

ప్రస్తుతం ఖరీఫ్ సాగు లోటు వర్ష పాతంతో అధోగతి పాలవుతున్నా.. కూటమి సర్కార్‌కు పట్టనట్టు వ్యవహరిస్తోంది. దీంతో రైతులు తీవ్ర మనోవేదన చెందుతున్నారు. వేలకు వేలు ప్రైవేట్‌గా అప్పులు తెచ్చి ఖరీఫ్ పంటకు సిద్ధపడగా వరుణుడు కరుణించకపోవడంతో ఎండిపోయే స్థితికి చేరుకున్నాయి. అలాగని ప్రత్యామ్నాయ పంటల సాగుకు కనీసం కూటమి ప్రభుత్వం చొరవ చూపకపోవడం, తేలిక రకం పంటల విత్తనాలు అందించక పోవడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వరి ఆకు మడులు ఎండిపోతున్నాయి..



ప్రస్తుతం వర్షాలు పూర్తిగా కురవడం లేదు. వరి ఆకు మడులు ఎండిపోతున్నాయి. ప్రభుత్వం కూడా కనీసం కన్నెత్తి చూడడం లేదు. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– గుల్లిపల్లి అప్పలరాజు, శ్రీరాంపురం

ప్రభుత్వ సహకారం అందించాలి..



వర్షాలు లేక వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన ఖరీఫ్ వరి పంట కళ్లెదుటే ఎండిపోతోంది. ప్రత్యామ్నాయ పంటలకు సంబంధించి తేలిక రకం పంటల విత్తనాలను అందించాలి. అలాగే పంటల రుణాలను అందించాలి.

– దాసరి దాలినాయుడు, సన్యాసినాయుడు, కూర్మవరం



కళ్లేపల్లి గ్రామంలో ఆకుమడులను కాపాడుకునే ప్రయత్నంలో రైతులు

బెల్లానకు రాఖీ కట్టిన బ్రహ్మకుమారి

చీపురుపల్లి: అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్ వేడుకలు చీపురుపల్లిలో ఘనంగా జరిగాయి. ప్రతి ఇంటిలో ఆడపడుచులు తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు అందుకున్నారు. పట్టణంలోని ఈశ్వరీయ బ్రహ్మకుమారీస్ కేంద్రం ఇన్‌చార్జి బి.కె.శాంతి మాజీ ఎంపీ, పీఏసీ రాష్ట్ర మెంబర్ బెల్లాన చంద్రశేఖర్‌కు రాఖీ కట్టి రక్షాబంధన్ ప్రాముఖ్యతను వివరించారు.



మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీస్ కేంద్ర ఇన్‌చార్జి బి.కె.శాంతి

చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌లో రక్షా బంధన్



చిన్నారులతో రక్షా బంధన్ కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ ఇన్‌చార్జ్ లతక్కయ్య

చీపురుపల్లిరూరల్(గరివిడి):

గరివిడిలోని ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ సెంటర్‌లో రక్షా బంధన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గరివిడి ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో చిన్నారులందరికీ లతక్కయ్య రాఖీలు కట్టి రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం



ఎస్సీ కాలనీలో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి లైన్ కలుపుతున్న సిబ్బంది

చీపురుపల్లిరూరల్ (గరివిడి):

సాక్షి ఎఫెక్ట్...

గరివిడి మండలం కాపుశంభం ఎస్సీ కాలనీలో తలెత్తిన విద్యుత్ సమస్యను విద్యుత్‌శాఖ అధికారులు శనివారం పరిష్కరించారు. 'అంధకారంలో ఎస్సీకాలనీ' శీర్షికన ఈ నెల 8న 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఏపీఈపీడీసీఎల్ ఏఈ సన్యాసిరావు ఆదేశాలతో విద్యుత్‌శాఖ సిబ్బంది కాలనీలో పాడైన రెండు విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్తవి వేశారు. లోఓల్టేజీ సమస్యను పరిష్కరించారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తంచేశారు. సమస్యను వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

చంద్రబాబు అంటేనే మోసం

గజపతినగరం రూరల్:

మోసం, వంచనకు మారుపేరు చంద్రబాబునాయుడు అని, ఆయన పాలన అంతా నయవంచనేనని జెడ్పీటీసీ గార తవుడు విమర్శించారు. మండలంలోని వేమలి, లోగిశ గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటిం టికీ వెళ్లి ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలను ప్రజలకు గుర్తు చేశారు.

ఈ సందర్భంగా జెడ్పీటీసీ తవుడు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు అండ్–కో ఎన్నికల్లో సూపర్ సిక్స్‌తో పాటు వందకుపైగా హామీలు ఇచ్చారని, వాటిలో ఏ ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. చంద్రబాబును మించిన అబద్ధాల కోరు ఎవరూ ఉండరన్నారు.



లోగిశ గ్రామంలో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూడి వెంకటరావు, యువ నాయకులు కె.పైడపునాయుడు, బెల్లాన త్రినాథరావు, మాజీ సర్పంచ్ అమ్మన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో కార్డన్ సెర్చ్



గిరిజనులతో మాట్లాడుతున్న పోలీసులు



నాటు తపాకీలు కలిగి ఉన్నవారిపై చట్టప్రకారం తీసుకునే చర్యలపై పున్నపురెడ్డిపేట వాసులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామ పంచాయతీ శివారు గ్రామాలైన సొంటివానిపాలెం, చిట్టివానిపాలెం గ్రామాల్లో ఎస్.కోట రూరల్ సర్కిల్ సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పోలీసులు శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లో ప్రతీ ఇంటిలో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ సుదర్శనరావు మాట్లాడుతూ ప్రభుత్వ లైసెన్స్‌లు లేకుండా తుపాకీలు వినియోగించవద్దని హితవు పలికారు. ఎవర దగ్గరైనా నాటు తుపాకీలు ఉంటే వేపాడ పోలీస్‌స్టేషన్‌లో అప్పజెప్పాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్ల: మండలంలోని తెట్టంగి, పున్నపు రెడ్డి పేటలో సీఐ శంకరరావు, ఎస్ఐ పి.నారాయణరావు ఆధ్వర్యంలో గుర్ల పోలీసులు శనివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. నాటు తుపాకీలు ఉపయోగిస్తున్న వారి ఇళ్లలో సోదాలు జరిపారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం ఏర్పాటుచేసి ఎటువంటి అనుమతులు లేకుండా నాటు తుపాకీలను ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాటు తుపాకీలను కలిగి ఉన్నవారు పోలీసులకు అప్పగించాలని కోరారు.

ఆదివాసీలను నిలువునా మోసం చేసి సంబరాలా...!

- ఎమ్మెల్సీ రఘురాజు
- జిందాల్ భూ మాయపై ధ్వజం



ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు

లక్కవరపుకోట (ఎస్.కోట): ఆదివాసీలను నిలువునా మోసం చేస్తూ మరోవైపు ఆదివాసీ దినోత్సవ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఎస్.కోట మండలం బొడ్డవర గ్రామంలో ఆయన విలేకరులతో శనివారం మాట్లాడారు. జిందాల్ యాజమాన్యం గిరిజనులను మోసం చేసిన తీరును వివరించారు. ఆదివాసీల భూములను సేకరించి తగిన పరిహారం చెల్లించకుండా వారికి తెలియకుండా వారి భూములను యాజమాన్యం రిజిస్ట్రేషన్ చేసుకున్న తీరును తప్పుబట్టారు. న్యాయం చేయాలని 50 రోజులుగా రోజుకో రీతిలో ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు.

జిందాల్ యాజమాన్యం తీరుతో 248 గిరిజన కుటుంబాలు నష్టపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులను జిందాల్ యాజమాన్యం మోసగించిన అంశాల్లో అత్యంత కీలకమైనది సర్వే నంబరు 146 – 4లో గల దెప్పూరు గ్రామంలోని 13 మంది గిరిజన కుటుంబాల పక్కా ఇళ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తుండగా సదరు గ్రామ గిరిజనులను సైతం మోసం చేసి రిజిస్ట్రేషన్ చేయడం శోచనీయమన్నారు. ఈ అక్రమ రిజిస్ట్రేషన్లపై ఉన్నత స్థాయి అధికారులతో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు పలువురు గిరిజనులు ఉన్నారు.

గిరిజన సమస్యలు పరిష్కరించకుండా ఉత్సవాలా...!



నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

శృంగవరపుకోట: గిరిజన సమస్యలు పరిష్కరించకుండా ఆదివాసీ సంబరాలు చేసుకోవడం గిరిజనులకు అన్యాయం చేయడమేనని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం పేరుతో ఒక పక్క సంబరాలు చేస్తుంటే ఎవరికోసమైతే సంబరాలు చేస్తున్నారో.. అదే ఆదివాసులు జిందాల్ చేసిన మోసాలకు 50 రోజులుగా రోడ్డు పైకి కూడా రాలేని పరిస్థితిలో శివాలయంలో పోలీసుల వలయంలో నిర్బంధించి ఆదివాసీ సంబరాలు చేసుకోవడం సిగ్గుచేటని అన్నారు. శనివారం బొడ్డవరలో భూములు కోల్పోయిన గిరిజనులతో నిరసన చేపట్టారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ గిరిజనులకు ఫలాలు అందడం లేదన్నారు. భూములు కొల్పోయిన గిరిజనులు రోడ్డు పక్కన ఆందోళన చేస్తుంటే వారిని పట్టించుకోని ప్రభుత్వం అధికారులు, ప్రజాప్రతినిధులు ఆదివాసీ దినోత్సవం జరపడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో గిరిజన సాంప్రదాయలతో ఆకులు, అలములతో నిరసన తెలిపారు.

కోటలో రాఖీ పౌర్ణమి వేడుకలు

శృంగవరపుకోట: పట్టణంలో రాఖీ పౌర్ణమి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం శాఖ ఇన్‌చార్జి సోదరి బీకే శైలజ ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో పాటు కుటుంబ సభ్యులకు రాఖీ యొక్క ఆధ్యాత్మిక రహస్యాన్ని వివరించారు. రఘురాజుకు రాఖీ కట్టారు. అనంతరం పుణ్యగిరిలోని తిరుమలగిరి క్షేత్రంలో పవిత్ర రాఖీ వేడుకలు నిర్వహించి ఈశ్వరీయ కానుక అందించారు.



ఎమ్మెల్సీ రఘురాజుకు రాఖీ కడుతున్న శ్రీబ్రహ్మకుమారి శైలజ

12న జాతీయ నులి పురుగుల నివారణ దినం



నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించి పోస్టర్లను విడుదల చేస్తున్న వైద్య సిబ్బంది

కొత్తవలస: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నామని విజయవంతం చేయాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ కోరారు. కార్యక్రమం నిర్వహించే తీరుపై పీహెచ్‌సీ ఆవరణలో వైద్య సిబ్బందికి శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోను ఏడాది వయస్సు నుంచి 19 సంవత్సరాల మధ్యలో గల పిల్లలు 5060 మంది వున్నట్టు తెలిపారు. అంతకు ముందు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యూరియా..ఏదయా..!



చంద్రంపేటలో వరి నారు తీస్తున్న మహిళా రైతులు

గంట్యాడ: అన్నదాత ఎరువు దొరకక అవస్థలు పడుతున్నారు. రైతులకు సరిపడ ఎరువులు అందుబాటులో ఉంచామని కూటమి సర్కార్ గొప్పలు చెబుతోంది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. రైతన్నకు యూరియా కూడా అందించలేని దుస్థితిలో కూటమి సర్కార్ ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో తాటిపూడి సాగునీటి ప్రాజెక్టు క్రింద గ్రామాలైన మధుపాడ, మదనాపురం, వసాది, పొల్లంకి, పెంటశ్రీరాపురం, లక్కిడాం, వసంత, చిన వసంత, చంద్రంపేట, బోనంగి, తాటిపూడి, రేగుబిల్లి, మోకాలపాడు, రామభద్రపురం, కొర్లాం తదితర గ్రామాల్లో ఖరీఫ్ వరి సాగు ప్రారంభమైంది. మండలంలో సాధారణ విస్తీర్ణం 5,500 హెక్టార్లు కాగా 2 వేల హెక్టార్లలో వరి నాట్లు పూర్తయ్యాయి. అయితే గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో యూరియా దొరక్క రైతులు అవస్థలు పడుతున్నారు.

మండలంలో 20 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిలో ఒకటి రెండు కేంద్రాలు మినహా మిగిలిన కేంద్రాల్లో యూరియా లభించడం లేదు. ప్రైవేటు డీలర్ల వద్ద యూరియా ఉన్నప్పటికీ వారు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. యూరియా అధిక ధరకు విక్రయించడం, లేదా జింక్, గుళికలు వంటివి కొనుగోలు చేసిన వారికే యూరియా ఇస్తున్నారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. బస్తా యూరియా రూ. 267కు అమ్మాల్సింది రూ. 300 వరకు విక్రయిస్తున్నారు. వ్యవసాయ అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీలర్లు యూరియా బ్లాక్ చేస్తున్నప్పటికీ వారిపై చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇండెంట్ పెట్టాం..

మండలంలో మొదట విడతగా 18 రైతు సేవా కేంద్రాలకు యూరియా ఇచ్చాం. రెండో విడత కోసం ఇండెంట్ పెట్టాం. డీలర్లు యూరియా బ్లాక్ చేస్తే చర్యలు తప్పవు.

– బూసే శ్యామ్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి